

మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి

## డీఈవోను తొలగించాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 16 : దళితులు, గిరిజనులను అవమానిస్తున్న డీఈవోను వెంటనే తొలగించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతమున్న డీఈవో ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, కార్యాలయ సిబ్బందితో వివాదాస్పదంగా వ్యవహరిస్తున్నారని, ఎక్కడా లేనివిధంగా ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో జిల్లాలో అనేక తప్పులు జరిగాయన్నారు. డీఈవోకు ఉపాధ్యాయ సర్వీస్‌రూల్స్‌పై అవగాహన లేదన్నారు. విద్య విషయంలో అతడికి అనుభవం లేక ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని, అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తూ పైరవీతో డీఈవోగా వచ్చినట్లు తెలిపారు. ఎస్సీ మహిళా రోస్టర్‌లో అవకతవకలు జరిగాయని, అసమర్థ డీఈవోను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహేందర్, ఎల్లయ్య, వెంకట్రామ్, ప్రశాంత్ పాల్గొన్నారు.


కురవి: జ్వరంతో బాధపడుతున్న తండావాసులు

## బాల్యతండాకు జ్వరం

కురవి, ఆగస్టు 16 : మండలంలోని బాల్యతండా వాసులు జ్వరంతో బాధపడుతున్నారు. రెండు రోజులుగా పీహెచ్‌సీ వైద్యులు శిబిరాలు నిర్వహిస్తున్నా జ్వరాలు అదుపులోకి రావడంలేదు. ఇంటికి ఒకరిద్దరు చొప్పున జ్వరంతో ఇబ్బందిపడుతున్నారు. భూక్యా సరోజ, సోమ్లా, రమేశ్, మంగమ్మ, మంగ్యా, లింగ్యా, ఈశ్వర్, మోహన్, భూరమ్మ, అనిత్, వెంకన్న, చంద్రశేఖర్, సోమ్లా, ఈశ్వర్ తదితరులు పలు దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. మరికొంత మంది తండావాసులు స్థానికంగా ఆర్ఎంపీల వద్ద వైద్యం చేయించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వైద్య శిబిరం నిర్వహించి, మందులు అందజేయాలని బాల్య తండావాసులు కోరుతున్నారు.

## బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

కేసముద్రం, ఆగస్టు 16 : మూతపడిన క్వారీ నుంచి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దామోదర్ అన్నారు. 'క్వారీ నుంచి అక్రమంగా మట్టి తరలింపు' అనే శీర్షికతో శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన తహసీల్దార్ శుక్రవారం క్వారీకి వెళ్లి పరిశీలించారు. క్వారీ మట్టిని అమ్ముకోవడానికి అనుమతి లేదని, టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. క్వారీని పరిశీలించిన వారిలో ఆర్ఐ సౌజన్య, జూనియర్ అసిస్టెంట్ నరేశ్ ఉన్నారు.

## ఉపాధ్యాయుడిగా.. సమాజ సేవకుడిగా ..

డోర్నకల్, ఆగస్టు 16 : మండలంలోని చిల్కోడు మోడల్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు పరిమి నవీన్ ఉపాధ్యాయుడిగా, సమాజ సేవకుడిగా ప్రజలకు సేవలం దిస్తున్నారు. ముల్కలపల్లి నుంచి చిల్కోడు మోడల్ స్కూల్‌కు వెళ్లే రోడ్డుపై గుంతలు పడి వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. గమనించిన నవీన్ గుంతలు పూడ్చి, రోడ్డుకు మరమ్మతు చేయించారు. అదే విధంగా ఖమ్మం అన్న ఫౌండేషన్ అనాథాశ్రమంలో వృద్ధులకు భోజనం ఏర్పాటు చేయించారు. ఉపాధ్యాయుడిగా, సమాజ సేవకుడిగా ఆదర్శంగా నిలిచిన నవీన్‌ను పలువురు అభినందించారు.


ముల్కలపల్లి నుంచి చిల్కోడు మోడల్ స్కూల్‌కు వెళ్లే రోడ్డుపై గుంతలను పూడుస్తున్న ఉపాధ్యాయుడు నవీన్

## క్రికెట్ జట్టుకు మానుకోట విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 16 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-16 అంతర్ పాఠశాల, కళాశాల క్రికెట్ టోర్నమెంట్ ఉమ్మడి వరంగల్ జట్టుకు మానుకోట విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అజయ్‌సారథి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానుకోట పట్టణానికి చెందిన భామనపల్లె ధర్మచరణ్ రెడ్డి, వెల్దె చిన్మయి తేజ, మామిండ్లపల్లి తరుణ్ ఎంపికయ్యారని, వీరు సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపులో శిక్షణ పొందినట్లు తెలిపారు.

## మజీద్ ఏ రహెమానియా కమిటీ అధ్యక్షుడిగా రఫీఖాన్



కేసముద్రం, ఆగస్టు 16: మజీద్ ఏ రహెమానియా కేసముద్రం మండల కమిటీ అధ్యక్షుడిగా ఎండీ రఫీఖాన్ ఎన్నికయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ. నైమొద్దీన్, మహ్మద్‌అలీ, షేక్ రషీద్, హాషం, రజాక్ ఖాన్, అమీర్, మహబూబ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

# శాంతిభద్రతలను పరిరక్షించాలి

- ఫిర్యాదుదారులకు ప్రశాంత వాతావరణం కల్పించాలి
- ప్రాథమిక పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి
- మల్టీజోన్-1 ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 16 : ఫిర్యాదుదారులకు పోలీస్ స్టేషన్‌లో ప్రశాంత వాతావరణం కల్పించాలని మల్టీజోన్-1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన ఆయనకు ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ స్వాగతం పలికారు. పోలీస్ స్టేషన్‌లో సాయుధ బలగాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం టౌన్ పోలీస్‌స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ, జిల్లా అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా



మాట్లాడుతున్న మల్టీజోన్ -1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి

ఆయన మాట్లాడుతూ.. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పని చేసే పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను పక్కా వ్యూహంతో అరికట్టాలన్నారు. పోలీస్ స్టేషన్ల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని రికార్డులు, ఫైళ్లను క్రమపద్ధతిలో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ చెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావు, ఏఆర్ డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# ఏజెన్సీకి 'సీతారామ' నీళ్లు ఇవ్వాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో దాడులు చేయిస్తుంది
- అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 16 : సీతారామ ప్రాజెక్ట్ నీటిని ఏజెన్సీ మండలాలకు అందించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో వివిధ సంఘాల బాధ్యులతో కలిసి నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్ట్ డిజైన్‌ను మార్చి రెండు పంటలు పండే ప్రాంతానికే మళ్లీ నీటిని తరలించే ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఖమ్మంలో సభ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలవడానికి వెళ్లిన తమ పార్టీ నాయకులు మధు, సారంగపాణి, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావును పోలీసులు అరెస్ట్ చేసి, దుర్భాషలాడడంతోపాటు కొట్టుకుంటూ స్టేషన్‌కు తీసుకెళ్లడం దారుణమన్నారు. ప్రజలు, ఉద్యమకారుల ప్రజాస్వామిక హక్కులను కాపాడుతామని చెప్పిన ప్రజాప్రభుత్వం ఇలా చేయడం మంచిది కాదన్నారు. పోలీసుల ద్వారా ప్రజాఉద్యమాలను ఆపలేరని, ఇలాంటి దౌర్జన్యాన్ని ప్రజలు సహించరని, మీ ఆటలు ఎంతోకాలం సాగవని హెచ్చరించారు. దాడులకు పాల్పడిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైస శ్రీనివాస్, గునికంటి రాజన్న, పాపారావు, వెంకటేశ్వర్లు, హలావత్ లింగన్న, జడ సత్యనారాయణ, దేవేందర్, కోటేశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న

# రూ.5వేల కోట్లు కేటాయించాలి

### గోపా డివిజన్ అధ్యక్షుడు సమ్మయ్యగౌడ్

కేసముద్రం, ఆగస్టు 16: కల్లు గీత కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5వేల కోట్లు కేటాయించాలని గోపా డివిజన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్లు గీత కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. సొసైటీలకు 5 ఎకరాల భూమి కేటాయించి తాటి, ఈత వనాలను పెంపునకు సహకరించాలని డిమాండ్ చేశారు. గీత కార్మికులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యమగాని వెంకన్న, మోడెం వెంకటేశ్వర్లు, బండారి శంకరయ్య, ఓరుగంటి వెంకన్న, మెడి ఉప్పలయ్య, బొమ్మగాని ఎల్లయ్య, పుట్ట ప్రభాకర్, బుర్ర కుమారస్వామి, గంధసిరి శ్రీనివాస్, ముత్తిలింగం, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కేజీకేఎస్ నాయకులు

## ఐదు రోజులు ఇంట్లోనే వృద్ధుడి శవం

### దుర్వాసన రావడంతో గుర్తించిన గ్రామస్తులు

గూడూరు, ఆగస్టు 16 : ఐదు రోజులుగా ఇంట్లోనే ఉన్న ఓ వృద్ధుడి మృతదేహం దుర్వాసన రావడంతో గ్రామస్తులు గుర్తించి దహన సంస్కారాలు చేశారు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని సీతానగరం గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. సీతానగరం గ్రామానికి చెందిన వేల్పుల బుచ్చయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. భార్య, కొడుకు, ఒక కూతురు గతంలో చనిపోయారు. ఇద్దరు కూతుర్లకు పెండ్లిళ్లు చేశాడు. ఒంటరైన బుచ్చయ్య ఇంట్లో ఒక్కడే ఉంటున్నారు. మూత్రాశయ సంబంధిత వ్యాధితో అస్వస్థతకు గురైన బుచ్చయ్య గత సోమవారం కనిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా శుక్రవారం ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో గ్రామస్తులు వెళ్లి చూడగా, బుచ్చయ్య అప్పటికే మృతిచెందిఉన్నాడు. గ్రామ పెద్దలు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, కుళ్లిపోయిన బుచ్చయ్య శవానికి దహన సంస్కారాలు నిర్వహించారు.


బుచ్చయ్య(ఫైల్)

## కురవి ఏవో మంజుఖాన్ బదిలీ

కురవి, ఆగస్టు 16 : 12 ఏళ్లుగా మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వర్తించిన కురవి ఏవో మంజూఖాన్ బదిలీపై ఖమ్మం జిల్లా వైరా మండల వ్యవసాయ శాఖ అధికారిగా వెళ్తున్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో ఉత్తమ సేవలకు గాను కలెక్టర్ సమక్షంలో ప్రభుత్వ విప్ రామచంద్రూనాయక్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న నరసింహారావు కురవి ఏవోగా రానున్నారు.

## 28లక్షల మంది రైతులకు కాంగ్రెస్ ఎగనామం

గార్ల, ఆగస్టు16: సుమారు 28లక్షల మంది రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ ఎగనామం పెట్టినట్లు బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలు గుండెబోయిన నాగమణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ రైతులను మోసం చేస్తున్నదన్నారు. ఇంత వరకు 40 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ జరగలేదని, రైతులు బ్యాంకులకు వెళ్లి అడిగినా ఎవరూ సమాధానం చెప్పడం లేదన్నారు. కార్యక్రమంలో చంద్రకళ, విజయ, మంగమ్మ, రజిని, సుమలత పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

తొర్రూరు, ఆగస్టు 16 : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ కే జగదీశ్ సూచించారు. తొర్రూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దన్నారు. ప్రత్యేకంగా బస్టాండ్ వద్ద ఆటోలను పార్క్ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జి ఉపేందర్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

నర్సింహులపేట, ఆగస్టు 16: కొమ్ములవంచ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బాలరాజు సతీమణి తారమ్మ(55) మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ శుక్రవారం తారమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీరాహుస్సేన్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట జాటోత్ దేవేందర్, రామన్న, వెంకటేశ్వర్లు, జంపన్న ఉన్నారు.

## గొల్లపల్లి కేశవశ్రీకి ఘన సన్మానం

నెల్లికుదురు, ఆగస్టు 16 : శ్రీరామగిరి గ్రామానికి చెందిన గొల్లపల్లి కేశవ శ్రీ భారత నావికా దళానికి ఎంపికై ఉద్యోగం కోసం అండమాన్ దీవులకు వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన శ్రీ వివేకానంద సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో కేశవ శ్రీతోపాటు తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఈ కా ర్యక్రమంలో సమితి అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, వైమానిక దళం ఆఫీసర్ పోరండ్ల శ్రీనివాస్, ప్రతినిధులు కళాధర్ రాజు, రామగిరి ఉప్పలయ్య, జీ నరేశ్, ప్రభాకర్, నర్స య్య, రాములు, రవి, గుట్టయ్య, వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్ మారణకాండకు నిరసనగా ర్యాలీ

తొర్రూరు, ఆగస్టు 16 : బంగ్లాదేశ్ మారణకాండలో మృతిచెందిన హిందువులకు నివాళులర్పిస్తూ, వారిపై దాడులను నిరసిస్తూ హిందూ సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, కొవ్వొత్తులు వెలిగించి సంతాపాన్ని ప్రకటించింది. తొర్రూరులోని గాంధీ సెంటర్ నుంచి బస్టాండ్, అమరవీరుల స్తూపం వరకు శుక్రవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. హిందూ ఐక్య వేదిక పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా శనివారం అన్ని వ్యాపార వాణిజ్య సంస్థలు బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల బాధ్యులు కస్తూరి పులేందర్, మచ్చ సురేశ్, తోట శ్రీనివాస్, రాంబాబు, పస్తం సాంబ, తుర్పాటి వెంకటేశ్వర్లు, మెండి స్, రవి, రాజస్థాన్ యువ మంచ్ కేవ్ సింగ్, జబ్బర్ సింగ్, సంతోష్‌శర్మ, శివకుమార్, హరిబాబు, జంజీరాల నాగరాజు, మెరుగు రమేశ్, గోశాల అధ్యక్షుడు కుమారస్వామి, ఆర్గనైజేషన్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.


బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన మారణకాండకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

### ఇద్దరికి తీవ్ర గాయాలు

నర్సింహులపేట, ఆగస్టు 16: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి ఇద్దరికి తీవ్ర గా యాలైన ఘటన శుక్రవారం మండలంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మరిపెడ నుంచి తొర్రూరు వైపు బైక్‌పై తొర్రూరుకు చెందిన కొర్ర శ్రీకాంత్ (33) కొర్ర శేఖర్, దంతాలపల్లికి చెందిన పద్మ వెళ్తున్నారు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి నర్సింహులపేట స్టేజీ సమీపంలో జాతీయ రహదారిపై బోల్తాపడింది. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లాకేంద్రంలోని వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ శ్రీకాంత్ మృతి చెందాడు. శేఖర్, పద్మకు చికిత్స అందిస్తున్నారు.


శ్రీకాంత్ (ఫైల్)

# ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

దంతాలపల్లి, ఆగస్టు 16: మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన దేవాలయంలో శుక్రవారం పెద్దమ్మతల్లి, పోతురాజు విగ్రహాలతోపాటు యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాగా, పెద్దమ్మతల్లిని మండలి డిప్యూటీ చైర్మన్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాశ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నదానం చేశారు.


పూజలు చేస్తున్న మండలి డిప్యూటీ చైర్మన్, బండా ప్రకాశఖ

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నగూడూరు, ఆగస్టు 16 : మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన బేబి శరణ్య ఇటీవల అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందుతున్నది. ఈక్రమంలో కుటుంబ సభ్యులు స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి సహకారంతో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.12వేల చెక్కును స్థానిక బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మకంటి వెంకట్, వెంకన్న, నాగన్న, రవీందర్, అశోక్, మల్లేశ్, జితేందర్‌రెడ్డి, సైదులు, శ్రీను పాల్గొన్నారు.

## నేడు దవాఖానల్లో ఓపీ సేవలు బంద్

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 16 : కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై లైంగిక దాడి, హత్యకు నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ న్యూఢిల్లీ పిలుపు మేరకు నేడు జిల్లాలోని అన్ని దవాఖానల్లో ఓపీ, సాధారణ సేవలు నిలిపివేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు బానోత్ నెహ్రూనాయక్, కార్యదర్శి సురేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి 18న ఉదయం 6 గంటల వరకు వైద్య సేవలు బంద్ చేయనున్నట్లు తెలిపారు.

## పోస్టింగ్‌లు ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 16 : అవుట్ సోర్సింగ్ టీచర్లకు వెంటను పోస్టింగ్‌లు ఇవ్వాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బోడ రమేశ్ కోరారు. శుక్రవారం పట్టణంలోని రీజినల్ కో ఆర్డినేటర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వం ఏకలవ్య, గిరిజన రెసిడెన్షియల్ గురుకులంలో టీచర్ పోస్టులను భర్తీ చేసిందన్నారు. దీంతో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉపాధి కోల్పోయారని, వారిని వెంటనే సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాముానాయక్, వెంకన్న, మాలు పాల్గొన్నారు.

## కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 16 : అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.21వేలు అందించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో రేషపల్లి నవీన్, నరసమ్మ, సౌమ్యశ్రీ, వరలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

## అభివృద్ధికి నిధులను కేటాయించాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 16 : మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఐ నాయకులు పురుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న కోరారు. శుక్రవారం వార్డుబాట కార్యక్రమంలో భాగంగా 21, 23, 24వ వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. సీడీఎఫ్ నిధులతో వార్డులను అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో పద్మ, మహేశ్, మమత, నాగయ్య, శ్రీను పాల్గొన్నారు.

## ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

కురవి, ఆగస్టు 16 : కురవి సిద్ధార్థ హైస్కూల్లో ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు 2024-25 విద్యా సంవత్సరానికి ప్రారంభమైనట్లు శుక్రవారం హెచ్ఎం కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యలో చదువు మానేసిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాల కోసం ఫోన్ నంబర్ 9885214380లో సంప్రదించాలని కోరారు.

## పాపన్న జయంతిని నిర్వహించాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 16 : బహుజన విప్లవ కారుడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను ఈ నెల 18న ఘనంగా నిర్వహించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఆయన చరిత్ర అందరికీ తెలిసేలా మండల కేంద్రాలలో ఘనంగా నిర్వహించాలన్నారు.

## వైద్యులకు రక్షణ కల్పించాలి

మహబూబాబాద్ రూరల్ : వైద్యులకు రక్షణ కల్పించాలని జూనియర్ డాక్టర్ మధు అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఎదుట పలువురు వైద్య విద్యార్థులు ప్లకార్డ్స్‌తో నిరసన వ్యక్తం చేశారు. కలకత్తాలోని జూనియర్ వైద్యురాలిపై లైంగికదాడి జరగడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## నేడు జిల్లా బంద్

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 16 : బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా శనివారం జిల్లా బంద్‌కు పిలుపునిచ్చినట్లు హిందూ ఐక్య వేదిక నాయకుడు మురళీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. స్వచ్ఛందంగా వ్యాపారులు, విద్యాసంస్థలు, హోటల్స్ బంద్ చేయాలని కోరారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి

మహబూబాబాద్ రూరల్,ఆగస్టు 16 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కోర్టు సెంటర్ నుంచి మూడుకోట్ల సెంటర్ వరకు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## రోగులకు పండ్ల పంపిణీ

తొర్రూరు, ఆగస్టు 16: స్వర్గీయ మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా బీజేపీ నాయకులు శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధులకు నేడు వైద్య శిబిరం

తొర్రూరు, ఆగస్టు 16 : ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో లయన్స్ భవన్ ఆవరణలో వయోవృద్ధులకు నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు.

## కొత్తగూడలో ఉచిత వైద్య శిబిరం

కొత్తగూడ, ఆగస్టు 16 : కొత్తగూడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంత్రి సీతక్క ఆదేశాల మేరకు సీతక్క ఫౌండేషన్ చైర్మన్ కుంజ కుసుమాంజలి సూర్య శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 1500 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు.

**అయ్యగారిపల్లిలో..**

ఇనుగుర్తి, ఆగస్టు 16 : మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేశ్ మాట్లాడుతూ.. గ్రామంలో విషజ్వరాలు వ్యాప్తి చెందినట్లు తెలిపారు. సుమారు 68 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది భిక్షపతి, కృష్ణవేణి, ప్రవీణ్, అల్లిక, ఆశలు పాల్గొన్నారు.

## 31లోపు సర్టిఫికెట్లు సమర్పించాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 16 : జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న పీహెచ్‌సీ విద్యార్థులు తమ సర్టిఫికెట్లను అందజేయాలని డీఈవో రామారావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామ్ సూచనల మేరకు ఒరిజినల్ పీహెచ్‌సీ సర్టిపికెట్లు, పర్మిమెంట్ వాల్యువేషన్ 2025 వరకు ఉన్నవి మాత్రమే సమర్పించాలని, సదరం సర్టిఫికెట్లు జత చేయాలన్నారు. ఈ నెల 31లోపు డీఈవో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మరిపెడ, ఆగస్టు 16 : నర్సింహులపేట మండలం పెద్దనాగారం సబ్‌స్టేషన్ పరిధిలోని నీలికుర్తి, పర్కజల్‌తండా, చిల్లంచర్ల, కొత్తూరు, రాంపురంలో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎల్లంపేట సబ్‌స్టేషన్ ఏఈ అజయ్ తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.

మరిన్ని జిల్లా వార్తలు 8వ పేజీలో